# రవ్వల బేసరి

శ్రీమతి కే. యన్. మూర్తిబాయిగారు

నాకు నగలమీద ఎంత అసహ్యమో మాఆవిడకు అంతఆపేక్ష. నాకు కలెక్టరు కచేరీలో 60 రూపాయిలజీతం. భూములమీద సాలుకు 600లు వస్తాయి. ఒకనాడు నేను యింటికి వచ్చేసరికి మాశ్యామల "ఏమండో! నాకు రవ్వలబేసరి చేయించరూ" అంది. కచేరీలో నడుము ళాక్కుపొయ్యేటట్టు రాసిరాసి యింటికివచ్చేసరికి కాళ్లుకడుక్కునేందుకు నీళ్లయినా ఇవ్వకుండా బేసరి చేయించమనేసరికి నాకు ఎక్కడలేనికోపమూ వచ్చింది. కాని ప్రస్తుతము స్త్రీ స్వాతంత్రము నలుగడలవ్యాపించివుండుటచేత ఏమి అనడానికీ వీల్లేక "ఆలాగే" అన్నాను. మాశ్యామల నాసంగతి గ్రహించిందికాబోలు ఆవేళకు వూరుకుంది.

ఒకమాటు ఆదివారంనాడు మళ్లీ "బేసరిచేయించరూ" అంది. నేనుకూడా కొంచెం శ్రద్ధవహించినట్టు "ఎల్లాగుంటుంద" న్నాను. వెంటనే "ఇదిగో తెచ్చి చూపించనా" అంటూ పొరుగింటి కామాక్షమ్మదగ్గిరకువెళ్లి బేసరి పట్టుకొనివచ్చి నాకు చూపించింది. తన ముక్కుకుపెట్టుకొని "ఇంతేవుంటే బాగుంటుంది. మరీపెద్దదయితే నాజూకుగా ఉండదు. ...ఏం—మాట్లాడరేం" అంటూ నామొఖంకేసిచూసింది శ్యామల. ఇదంతా చూస్తే నాలోనాకే నవ్వువచ్చింది. ఆవిడని వూరుకోబెట్టడానికి అన్నానుగదా "సరే! ఈయేడాదికి మనభూములమీద వచ్చిన శిస్తు అయిపోయిందిగదా! మీదటికి తప్పకుండా చేయిస్తా" న్నాను. మీదటిదాకా ఆగడానికి కష్టముతోచిందికాబోలు మాఆవిడ మొహం చిన్నబుచ్చుకుంది. నాకూ ఆవిడకోరిక నెరవేర్చలేకపోతినని మనస్సు పీకుతోంది. కాని యేమి చెయ్యడం? బేసరిచేయించడానికి డబ్బేదీ! రొఖ్ఖసొమ్ముపోసిచేయించడానికి చేతిలో లేకపోయినా అర్మగాచారిలాంటి గొప్పనగలవర్తకులెవరయినా అరువుయివ్వరా అని తీవ్రంగా ఆలోచిస్తూకూర్చున్నాను. రుసరుసలాడుతూ వంటయింటిలోకి వెళ్లిపోయింది శ్యామల. ఆవేళనాడు కాఫీ, ఫలాహారమూ సున్నచుట్టిందన్నమాటే.

ఇంతట్లో నేనెరిగిన వకషరాబు మావీధిన వెళ్లుతూవుండడంచూశాను. ఆవేళ సెలవు దినంగనక ఫలాహారంమాట యెలావున్నా ఇంతకాఫీ అయినా త్రాగకపోతే సాయంత్రం దాకా గడవడం కష్టమని తోచింది. దేముడులాగకనబడిన షరాబుని లోపలికిపిలిచి క్రొత్త రకం రవ్వలబేసర్లు నాలుగయిదు చూపించమని చెప్పేసరికి అతను చూపించేడు. కొన్ని బేసర్లు నాలుగువందలు మొదలుకొనీవున్నాయి ఖరీదులు. అంతఖరీదు పెట్టడమంటే నాకు వకవిధమైన బెంగతోస్తూంది. అయినప్పటికీ శ్యామలవైపు బిక్కమొగంవేసుకుచూస్తున్నా. ఆవిడ నాలుగైదుబేసర్లు చూచి వకటిరాళ్లు బాగులేవనీ, ఇంకొకటి పొందికగాలేదనీ, మూడోది పెద్దదయిందనీ యిలాగ ఏవేవోవిమర్శనలు సాగించింది. నాకు కొంచెం ధైర్యం వచ్చింది. చివరకు బేరమైతే నసిపడలేదుగాని శ్యామల రుసరుసలువదిలేయి. షరాబు

అన్నాడు "ఇవి మీకునచ్చకపోతే ఫస్టుతారీఖునాటికి మీరుచెప్పినమోస్తరుగావుండేది వక బేసరి చేయించితెస్తాను. ఆర్డరు ఇవ్వండి" అన్నాడు. తనకు కావలసిన మోస్తరుఅంతా వర్ణించి చెప్పింది శ్యామల. ఇక తనపని అయిందని వంటింటిలోకి వెళ్లిపోయింది.

ఆర్డరు అప్పుడేయిస్తే అడ్వాన్సు యివ్వాలి. చేతిలో వకపైసా అయినాలేదు. అందుచేత యీసావకాశం పురస్కరించుకొని మెల్లిగా షరాబుని పంపించేశాను మంచి మాటలు చెప్పి. ఫస్టుతారీఖున కనబడమన్నాను. ఈలోగా శ్యామల కాఫీతీసుకువచ్చి యెదటపెట్టింది. స్టవ్ వెలిగించి అయిదునిమిషాలలో కాఫీ తయ్యారుచేసే శక్తివుందిలెండి మాశ్యామలకి. అందులో రవ్వలబేసరి వస్తుందనే హుషారొకటి కూడాను. ఆవేళకి కాఫీవస్తులేకుండా త్రాగేసి వీధిలోకి షికారు వెళ్లిపోయాను. ఫస్టుతారీఖురానూవచ్చింది. షరాబూవచ్చేడు. కాని అడ్వాన్సు నూరురూపాయిలిమ్మనేసరికి ఇప్పుడు కాదని పంపేశాను. ఇంతట్లోకే మామూడో బావమరిదికి పెళ్లిఅనీ, మూడువేలుకట్నం అనీ, మమ్మలిని ఇద్దరినీరమ్మనీ మా మామగారి వద్దనుంచి ఒకవుత్తరంవచ్చింది. మాశ్యామలతో "నాకు సెలవు దొరకదు. నువ్వు వెళ్లు" అన్నాను. ఎగిరి గంతువేస్తూ పెట్టెలో బట్టలూ అవీసర్దుకొంది. శ్యామల రైలుఖర్చుకు మాత్రం డబ్బుసరిపుచ్చి రాత్రిపండ్రెండుగంటలకి బయలుదేరే రైలులో శ్యామలను పంపించేను బరంపురం. సాయంత్రమే యిచ్చేనులెండి మామగారిపేర టెలిగ్రాం శ్యామలని పంపుతున్నానని.

ఒంటరిగా ఇంట్లోఉంటూ మాగదిలోవున్న పటాలకేసి చూస్తూ ఆలోచిస్తూ కూర్చున్నాను. శ్యామలకోరిక తీర్చలేకపోయ్యానే అని మరీ తీవ్రంగా ఆలోచనాపరంపరలతో కాలంగడుపుతూవున్నాను. నాబాల్యస్నేహితుడు ఒకాయన ప్లీడరీచేస్తున్నాడు. ఆయన్ని అడిగి నూరురూపాయలు బదులుతీసుగొచ్చి అడ్వాన్సుయిచ్చి రైతులతో మాట్లాడి మీదటికివచ్చే అయివజుమీద నాలుగువందలు బదులుపుచ్చుకొని యెల్లాగయినా శ్యామల వచ్చేసరికి బేసరి చేయిద్దామని నిశ్చయించుకున్నాను. ఆరాత్రికి నిద్రపట్టింది.

మర్నాడు కచేరికి వెళ్లేసరికి చెన్నపట్నంనుంచి పైఆఫీసర్లు తనిఖీకివస్తున్నారనీ కాగితాలన్నీ సరిగా ఆర్డరులో పెట్టవలసిందనీ అన్నారు. ఆనాలుగురోజులూ కచేరితనిఖీతోటే అయిపోయింది. ఇక షరాబుమాటా జ్ఞాపకంలేదు. ప్లీడరుస్నేహితుడిమాటా జ్ఞాపకంలేదు. తనిఖీపూర్తి అయింది. పైఆఫీసర్లు వెళ్లిపోయారు. ఇంటికివచ్చి గృహలక్ష్మిపత్రిక తిరగవేస్తూ కూర్చున్నాను. ఇంతట్లోకే రాత్రిమెయిల్లో దిగుతున్నామని మాబావమరది యిచ్చిన టెలిగ్రాం అందినది. గభాలునలేచి మాదొడ్డమ్మతో "శ్యామలని పెద్దబావ తీసుకొస్తున్నానని రాశాడు. మెయిలులో వస్తారు" అన్నాను. రాత్రి తొమ్మిదిగంటలకి సరిగ్గా స్టేషనుకివెళ్లి వాళ్లయిద్దరినీ యింటికి తీసుకువచ్చేను. భోజనానంతరం శ్యామల నాతో "ఏమండీ బేసరి మాట" అని మళ్లీ జ్ఞాపకంచేసింది. అప్పుడు తనిఖీసంగతి చెప్పి

అకస్మాత్తుగా తనిఖీవచ్చిఉండకపోతే నేను చేయదలచుకొన్నదంతా చెప్పేశాను. "మీకెంత కష్టమెందుకు" అంటూ తన పుస్తెల్లోవున్న తాళంతో సూట్‌కేసు తెరచి చిన్న మొఖమల్ పెట్టెలో ఎర్రని కాగితపుపొట్లంవిప్పి "చూడండి" అంది. చూశానుగదా రవ్వలబేసరి! "నాకు మాఅన్నయ్యపెళ్లికి ఆడబిడ్డ కట్నం" అంది శ్యామల ముక్కుకు పెట్టుకుంటూను. రవ్వలబేసరి!

# కొమ్ముటేన్గులవిగో కోరాడిరంపిల్లెడున్

శ్రీమతి కల్వాల పార్వతీదేవిగారు

౧

ఒకజాడింపుకి సంప్రహారకులు రయోద్ధూతంబునన్ బెండియై
యొకచక్కంబడఁ గట్టుకంబములు సుజ్ఞాతల్పోనర్పంగ వే
ఱొకచో శ్వేతపతాకముల్ సెదరగా యుద్ధంబుకై నిల్చి మూ
గుకవచ్చెన్ బలె కొమ్ముటేన్గులవిగో కోరాడిరంపిల్లుచున్.

౨

కనులన్మండెడుచంద్రవిస్ఫుకలతోఁ గార్కొన్నకార్మబ్బున
ల్లనిమైచాయల నెత్తుటేర్లగమితో లా గుల్వేసంబర్వ నె
చ్చనినిట్టూర్పులతుండముల్మలిచి వృక్షాగ్రంబులన్ లాగి మే
కొని వప్రాళిని గొమ్ముటేన్గులవిగో కోరాడిరంపిల్లెడున్.

౩

ఘీంకారంబులు మిన్నుముట్టె జయలక్ష్మీస్వాగతశ్లోకముల్
బింకంబూని పఠింపదంతములు ఫెళ్ఫెళ్లంచుమ్రోయంగ ని
శ్శంకంబీటలువారుకోటలు మహాసంకల్పముంజెప్ప నే
గొంకున్ లే కటఁ గొమ్ముటేన్గులవిగో కోరాడిరంపిల్లెడున్.

౪

ఏశేరీమొనగాండ్రు పట్టెదరటోయీ? మీదుబంధింపులా
పోరాటంబునఁజూపవచ్చునదిగో పోఁబోకుఁడావై వుడీ
కోరాదా? పసికూన లేటికిమహాక్రోధంబునం జెండ మీ
కూకల్మాన్పెడు కొమ్ముటేన్గులవిగో కోరాడిరంపిల్లెడున్.